క్లుప్తంగా

అభయాంజనేయస్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

డోన్: కార్తీక మాసోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని గుమ్మకొండ గ్రామ శివారులో వెలసిన పాతపాలెం అభయాంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి తమలపాకులు, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని అభిష్టాలు నెరవేరాలని పూజలు చేశారు.

అయ్యప్పస్వాములకు భిక్ష


భిక్ష స్వీకరిస్తున్న స్వాములు

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలోని అయ్యప్ప స్వామి ఆలయంలో దాతల సహకారంతో అయ్యప్పమాలధారులకు శనివారం నుంచి బిక్షను ప్రారంభించారు. జనవరి 13వ తేదీ వరకు స్వాములకు భిక్ష కొనసాగుతుందన్నారు. కనకాద్రిపల్లెతో పాటు చుట్టు పక్కల గ్రామాల అయ్యప్పస్వాములు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. దాతలు అందిస్తున్న సహకారంతోనే ఏటా స్వాములకు భిక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం

కోవెలకుంట్ల: స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు యంగ్‌మూడో జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం అరుణ కుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 28న పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన సుష్మ, ఆసియాబేగం, అస్మా, జైష్ణవి బంగారు పతకాలు సాధించారన్నారు. మాధురి, కృపా, చరణ్య, విజయ వెండిపతకాలు, సమీర, షాహిద, శ్రీనిధి, అమిబాబీ, షాబియా రజత పతకాలు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయినులు అభినందించారు.

గ్రామ పంచాయతీకి కంప్యూటర్ అందజేత


సర్పంచ్‌కు కంప్యూటర్ అందిస్తున్న యూనిట్ ఇన్‌చార్జ్ రెడ్డినాగరాజు

కొలిమిగుండ్ల: కల్వటాల గ్రామ పంచాయతీ కార్యాలయానికి రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో వివిధ రకాల సామగ్రి అందజేశారు. శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డితో కలిసి రామ్‌కో యూనిట్ ఇన్‌చార్జ్ రెడ్డినాగరాజు, అడ్మిన్‌హెడ్ రామరాజు చేతుల మీదుగా రూ.1.50 లక్షలు విలువ చేసే కంప్యూటర్, వాటర్ ఫిల్టర్, యాభై కుర్చీలను సర్పంచ్ కామిని సుమలతకు అందజేశారు. పంచాయతీ కార్యాలయంలో వివిధ రకాల పనుల కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం కంపెనీ సీఎస్ఆర్ నిధులతో అందించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈఓఆర్డీ శివ, సీనియర్ జనరల్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా తపాలా సేవలు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్యాపిలి: మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా సేవల్లో కూడా మార్పులు చేసుకోవడం హర్షణీయం అని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక మెయిన్ బజార్‌లో రూ. 44 లక్షలతో నిర్మిస్తున్న సబ్‌పోస్టాఫీసు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఉత్తరాలు రాసుకునే పరిస్థితి కనుమరుగైందన్నారు. దీంతో తపాలా శాఖ ఇతర సేవలపై దృష్టి సారించి ఆ మేరకు ప్రజలను భాగస్వామ్యం చేసుకుంటూ విజయవంతంగా ముందుకు వెళ్తోందన్నారు. తపాలా సేవల్లోనూ ఇంటర్నెట్, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ తపాలా వంటి సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సర్పంచ్ లక్ష్మీదేవి, పీఎంజీ ఉపేంద్ర, పీఏసీఎస్ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

నాణేల సేకరణ అభిరుచిగా..

- 200 దేశాలకు చెందిన కరెన్సీ
- గుప్తుల నుంచి మొగళుల కాలం వరకు నాణేలు
- 6వ తరగతి నుంచే సేకరణ మొదలు
- బేతంచెర్ల సోషల్ ఉపాధ్యాయుడి హాబీ


రాజుల కాలం నాటి నాణేలు


నాణేలు, కరెన్సీని పరిశీలిస్తున్న విద్యార్థులు (ఫైల్)

సాక్షి SUNDAY Special


విదేశీ కరెన్సీ నోట్లు


మన దేశ కరెన్సీ బిల్లలు

బేతంచెర్ల: సమాజంలో ఒక్కొక్కరికి ఒక అభిరుచి ఉంటుంది. తాము అనుకున్న రంగంలో రాణిస్తూ మరో వైపు తమకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంటారు. ఆ కోవలోనే ఒక ఉపాధ్యాయుడు తాను 6వ తరగతి చదువుతున్నప్పటి నుంచి మన దేశ పురాతన నాణేములతోపాటు వివిధ దేశాల కరెన్సీని సేకరించారు. బేతంచెర్ల పట్టణంలోని ధరణి టౌన్ షిప్పు జెడ్పీ హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయుడి పనిచేస్తున్న కొర్రపాటి జనార్దన్ గుప్తుల కాలం మొదలుకొని, శ్రీకృష్ణ దేవరాయలు, విష్ణు కుండినులు, చోళరాజులు, పల్లవులు, మొగళుల కాలం నాటి నాణేలతో పాటు 200 దేశాలకు చెందిన కరెన్సీని సేకరించారు. తన హాబీ ఇతరులకు కూడా ఉపయోగపడాలని భావించారు. విద్యార్థులకు అప్పటి కాలం నాటి నాణేలు, విదేశీ కరెన్సీలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో ప్రదర్శనకు ఉంచుతున్నారు. ఇటీవల రాజ్యాంగ దినోత్సవం నాడు విద్యార్థులకు ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు వాటిని చూసి ఎంతో సంతోష పడ్డారు. నాణేల ప్రాముఖ్యత విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రతి నాణేనికి ల్యామినేషన్ చేసి దానికి సంబంధించి వివరాలను పొందుపరిచారు.

మంచి అనుభూతి ఇచ్చింది



ఇన్ని నాణేలు, కరెన్సీని చూడడం మొదటిసారి. పుస్తకాలు, ఉపాధ్యాయులు చెప్పే పాఠాల ద్వారా మన చరిత్రలో వాడిన నాణేల గురించి తెలుసుకున్నాను. కాని మొదటిసారి ప్రత్యక్షంగా రాజుల కాలం నాటి నాణేలు, వివిధ దేశాల కరెన్సీ చూడడం జీవితంలో మరిచిపోలేను. నేను కూడా నాణేలు, కరెన్సీ సేకరణ చేయాలనుకుంటున్నా.

–రాణి, 10వ తరగతి విద్యార్థిని

విద్యార్థులకు చరిత్ర తెలియజేయాలనే ఉద్దేశంతోనే ప్రదర్శనలు



నేను 6వ తరగతిలో ఉన్నప్పటి నుంచే నాణేలు, వివిధ దేశాల కరెన్సీ సేకరణను చేపట్టాను. చిన్న తనంలో ఇచ్చిన డబ్బులను దాచిపెట్టి కరెన్సీ సేకరణను మొదలు పెట్టాను. అదే అభిరుచిగా మారింది. ఇప్పటి వరకు 3 హైస్కూళ్లలో విధులు నిర్వహించాను. మొదట గోనెగండ్ల మండలం పెద్దనేలటూర్ జెడ్పీ హైస్కూల్, చిన్న మల్కీవీడు జెడ్పీ హైస్కూల్, ప్రస్తుతం బేతంచెర్లలో పనిచేస్తున్నాను. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు రాజుల కాలం నాటి నాణేలు విదేశీ కరెన్సీపై అవగాహన కల్పించాను. నేను సేకరించిన నాణేలు, కరెన్సీతో విద్యార్థులు జ్ఞానం పెంచుకుంటే అదే చాలు.

–కొర్రపాటి జనార్దన్, సోషల్ ఉపాధ్యాయుడు

రాష్ట్ర ఫెన్సింగ్ జట్టుకు ఎంపిక


లక్ష్మీశ్రావణి

బనగానపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బి.లక్ష్మీశ్రావణి రాష్ట్ర ఫెన్సింగ్ జట్టుకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ తెలిపారు. నంద్యాలలో ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిందని చెప్పారు. ఈ నెల 14వ తేదీ నుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

పింఛన్ల పంపిణీ

డోన్: మున్సిపల్ పరిధిలో శనివారం సాయంత్రానికి 95.41 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు.

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఖాజీవాడ కాలనీలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, పీఆర్ డీఈఈ నాగ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలో 95.81 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఫజుల్‌రహిమాన్ తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

- న్యాయమూర్తులు తంగమణి, రాహుల్ అంబేడ్కర్


పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న జడ్జిలు

డోన్ టౌన్: ఈ నెల 14వ తేదీ జరగనున్న మెగా లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు తెలియజేసి అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు భవనంలో డోన్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో ప్రతి రెండు నెలలకు ఒకసారి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించడానికి పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, వాటిలో రాజీ అవ్వడానికి అవకాశం ఉన్న వాటిపై చర్చించారు. సమావేశంలో డోన్, బేతంచెర్ల సీఐలు ఇంతియాజ్‌బాషా, వెంకటేశ్వరరావు, డోన్, ప్యాపిలి,కృష్ణగిరి ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మల్లికార్జున, ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ భాస్కర్‌రావు, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, న్యాయవాదులు ధనుంజయరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, మధుసూదనగౌడ్, అంజనేయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవికి చక్ర హారతులు


అమ్మవారికి హారతి ఇస్తున్న భక్తులు

డోన్: కార్తీక మాసం చివరి శనివారాన్ని పురస్కరించు కుని స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలోని మహాలక్ష్మిదేవి అమ్మవారికి మహిళా భక్తులు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం వేకువ జామున అమ్మవారికి కుంభ, నక్షత్ర, చక్ర హారతులు పట్టారు. వేంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రాముశర్మ, శ్రీకాంత్‌శర్మ పాల్గొన్నారు.

ముచ్చట్ల మల్లికార్జునస్వామి సేవలో కాటసాని


స్వామి సన్నిధిలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల మల్లికార్జునస్వామిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఉమా మహేశ్వరమ్మ దంపతులు శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకుడు చంద్రశేఖరశర్మ, అంజనేయులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామివారి పట్టు వస్త్రంతో సత్కరించారు. ఆలయంలో కార్తీక మాసం, విశేష పర్వదినాల్లో అన్నదానం ఏర్పాటు చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని కాటసాని తెలిపారు.

నాపరాళ్ల ట్రాక్టర్ బోల్తా



కొలిమిగుండ్ల: స్థానిక అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారిలోని సెల్ టవర్ సమీపంలో శనివారం నాపరాళ్ల ట్రాక్టర్ బోల్తా పడింది. కనకాద్రిపల్లె సమీపంలోని గనుల్లోంచి నాపరాళ్లను లోడ్ చేసుకుని తాడిపత్రికి బయలు దేరింది. అంకిరెడ్డిపల్లె వద్దకు చేరుకోగానే టైర్ పగలి అదుపుతప్పి రోడ్డు పక్కన ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాద తీవ్రత తప్పింది.

సాహిత్యానికి వెలుగుజాడ.. గురజాడ


గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంఈఓ రామనర్సప్ప

డోన్ టౌన్: తెలుగు సాహిత్యానికి వెలుగునీడ గురజాడ అప్పారావు అని మండల విద్యాధికారి రామనర్సప్ప, సాహితీవేత్త, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తొగట సురేష్‌బాబు అన్నారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కొత్తపేటలోని జెడ్పీ హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలుగు రాష్ట్రంలో సంస్కృతంలో ఉన్న సాహిత్యాన్ని వ్యవహారిక భాషలోకి మార్చి అందరికీ అర్థమయ్యే రీతిలో అచ్చ తెలుగు భాషలోకి ఎన్నో గ్రంథాలను అనువదించారని తెలిపారు. ఆ రోజుల్లో మూఢనమ్మకాలను, ఆచారాలను పారద్రోలి జ్ఞానోదయం కలిగించే ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం ఆయన కృషి అజరామరం అన్నారు. అలాగే పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం, మోడల్ స్కూల్‌లో సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సువర్ణ ఆధ్వర్యంలో గురజాడకు నివాళులర్పించారు.

డోన్: భ్రూణహత్యలు మహా పాపమని, ఇలాంటి అనాగరిక పనులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ మోడల్‌స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శిరీష అన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో శనివారం శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్, గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం లింగ నిర్ధారణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సువర్ణ, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ మాట్లాడుతూ.. భ్రూణ హత్యల కారణంగానే ఆడపిల్లల నిష్పత్తి దేశంలో గణనీయంగా తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో మగపిల్లలే ఉండాలనే భావం అధికంగా ఉండడం వల్ల భ్రూణహత్యలు జరుగుతున్నాయన్నారు. లింగనిర్ధారణ పరీక్షలను అక్రమంగా నిర్వహించే సెంటర్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి తంగమణి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

డోన్: హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకూడదని..వారిని ఆదరించాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుండా వెంకటరత్నం శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జీలు తంగమణి, రాహుల్ అంబేడ్కర్ మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి సమూల నిర్మూళనే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలతో కలిసి కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన, డ్రామా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించవచ్చని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని, ప్రిన్సిపాల్ భారతి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ లక్ష్మయ్య, మేనేజర్ మధు, హ్యాండ్స్ సభ్యులు ఈశ్వర్‌రాజు, షాజహాన్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం

కోవెలకుంట్ల: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరమని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రెడ్ రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల నుంచి విద్యార్థులు సౌదరదిన్నె గ్రామం వరకు ర్యాలీ నిర్వహించి మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎయిడ్స్‌పై అవగాహన లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో యువత వ్యాధిబారిన పడుతున్నారన్నారు. ఎయిడ్స్‌వ్యాధికి మందులు లేవని నివారణే మార్గమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్‌రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ రామసుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, కృష్ణదాసు, చైతన్య ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు వర్ధనాచారి, నరసింహారావు, సుమలత, మధులత, అరుణ, రమాదేవి పాల్గొన్నారు.

కోర్టు ఎదుటే బాహాబాహీ


బెల్టు చంకలో పెట్టుకుని మహిళలను వీడియో తీస్తున్న లాయర్ కృష్ణ ప్రసాద్


చెప్పుతో లాయర్‌పై దాడికి యత్నిస్తున్న మహిళ

డోన్: డోన్ మండలం ఉడుములపాడు గ్రామ శివార్లలోని సర్వే నంబర్ 78-2లోని 2.13 ఎకరాల విషయంలో న్యాయవాది, బార్ అసోసియేషన్ కార్యదర్శికి మరో కుటుంబానికి మధ్య నెలకొన్న భూ వివాదం చిలికి చిలికి గాలివానై శనివారం కోర్టు ఎదుట పరస్పరం దాడులు చేసుకునేందుకు కారణం అయ్యింది. భూ వివాదంలో శనివారం కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన సామిరెడ్డి కుటుంబ సభ్యులు అక్కడే ప్రైస్‌మీట్ నిర్వహిస్తున్న న్యాయవాది లక్ష్మిశెట్టి కృష్ణప్రసాద్ మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. సహనం కోల్పోయిన కృష్ణ ప్రసాద్‌తో పాటు స్వామిరెడ్డి కుటుంబ సభ్యులు పరస్పరం దాడులు చేసుకునేందుకు ప్రయత్నించారు. కృష్ణ ప్రసాద్ మహిళలపై బెల్టుతో దాడి చేసేందుకు ప్రయత్నించగా ప్రతిగా మహిళలు న్యాయవాదిపై చెప్పులతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. కోర్టులో ఉన్న కొందరు కానిస్టేబుళ్లు ఈ గొడవను గమనించి ఇరువర్గాలకు సర్ది చెప్పి అక్కడి నుండి పంపించి వేయడంతో గొడవ సద్దుమణిగింది. కోర్టు లోపల లోక్ అదాలత్‌పై న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమీక్షిస్తుండగా కోర్టు ఎదుట రోడ్డుపై ఈ గొడవ జరగడం చర్చనీయాంశం అయ్యింది. ఇది ఇలా ఉండగా కోర్టు బయట జరిగిన గొడవకు డోన్ బార్ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

పోస్టాఫీసులు కిటకిట


పోస్టాఫీసు వద్ద బారులు తీరిన మహిళలు


ఖాతా తెరవడానికి ఎగబడుతున్న జనం

- సంక్షేమ పథకాలు వస్తాయని పుకార్లు
- దుష్ప్రచారంతో మహిళల బారులు

డోన్ టౌన్: బ్యాంకులో పొదుపు ఖాతా లేనివారు, ఉన్నా ఆధార్ లింక్(ఎన్‌పీసీఐ) చేయక సంక్షేమ పథకాల లబ్ధి పొందలేని వారు పోస్టాఫీసుల్లో ఖాతా తెరుచుకోవాలని అధికారుల సూచనలను సరిగ్గా అర్థం చేసుకోక మహిళలు పోస్టాఫీసులకు క్యూ కడుతున్నారు. ఖాతా తెరిస్తే సంక్షేమ ఫలాలు పొందవచ్చని కొందరు దుష్ప్రచారం చేయడంతో జనం బారులు తీరుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లాపాపలతో వెళ్లి గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఈ విషయాన్ని పోస్టల్ సిబ్బంది కూడా ధృవీకరించుకోకుండా వచ్చిన ప్రతి మహిళ వద్ద నుంచి రూ.200 వసూలు చేస్తూ ఖాతాలను తెరిచేస్తున్నారే తప్ప ప్రజలకు అవగాహన కల్పించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోస్టాఫీసు ఖాతాలోనే ప్రభుత్వాలు డబ్బులు జమ చేస్తారన్న కొందరి దుష్ప్రచారంతో ఇప్పటికే సంక్షేమ లబ్ధి పొందుతున్న వారు సైతం పోస్టాఫీసులకు పరుగులు తీస్తున్నారు. కార్యాలయాలు జనంతో కిక్కిరిసిపోతున్నాయి.


రూ.200లో రూ. 24 మాత్రమే జమ

పోస్టాఫీసులో ఖాతా తెరిచి ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయడానికి రూ.200 వసూలు చేస్తున్నారు. అయితే మొత్తం వారి ఖాతాలో జమ కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం రూ.24 మాత్రమే జమ అవుతున్నాయని ఖాతాదారులు వాపోతున్నారు. ఈ విషయంపై సిబ్బందిని ప్రశ్నిస్తుండగా భవిష్యత్‌లో ఖాతా నిర్వాహణ ఖర్చుల కింద ఇప్పుడే తగ్గుతుందని సమాధానం చెబుతున్నారు.

సందట్లో సడేమియా

పోస్టల్ సేవింగ్స్ ఖాతాలు పెంచాలన్న ఆ శాఖ ఉన్నతాధికారుల టార్గెట్స్‌ను సిబ్బంది ప్రస్తుతం నెలకొన్న పుకార్లను ఆసరాగా చేసుకున్నారు. సందట్లో సడేమియా అన్నట్టు అవసరం ఉన్నా, లేకున్నా ఖాతాలు తెరిచేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన పోస్టాఫీసు వద్ద వారం రోజులుగా ఖాతాల తెరవడం కోసం ప్రజలు పోటెత్తుతుండగా ఇదే అదునుగా భావించిన కొందరు గ్రామీణ పోస్టల్ బ్రాంచ్ అధికారులు డోన్‌కు వచ్చి ప్రజల ఖాతాలు ప్రారంభిస్తున్నారు. ఇదేమిటని అధికారులను అడిగితే ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని పిలిపించినట్లు చెబుతుండడం కోస మెరుపు.

మాదిగల ఆత్మీయ వనభోజనం


సంఘీభావం వ్యక్తం చేస్తున్న నాయకులు

డోన్ టౌన్: ఉడుములపాడులోని దత్తాత్రేయస్వామి దేవాలయ ఆవరణలో శనివారం మాదిగల ఆత్మీయ కార్తీక వన భోజనం సందడిగా సాగింది. అరుంధతి జాంభవ మాదిగ ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఐకమత్యంగా ఉంటూ ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారి

సంజామల: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సురేంద్ర నాయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామ సచివాలయం సమీపంలో కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో ఫారెస్ట్ అధికారి ఘటనా స్థలానికి చేరుకునే లోపు ముళ్లపొదల్లోకి వెళ్లిపోయింది. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే విషపురుగులు, పాముల బెడద ఉండదని సూచించారు.